# పేరయ్యు రాజంటూ..!



ఢిల్లీ సుల్తాన్ మోసంతో ప్రతాపరుద్రుని బందీగా పట్టుకుపోయాడు.

ఏకశిలా నగర సింహాసనం ఖాళీగా వుంటూ అరాచకం ప్రబలడమేగాక, రాజ్యం కూడా శత్రువుల పరం అయ్యే అవకాశం ఉందని భయపడి తీవ్రంగా అంతరంగిక సమాలోచనలు జరుపసాగాడు మంత్రి యుగంధ నారాయణుడు.

ఇనకులానికి వశిష్ఠుడిలా కాకతీయుల గురువైన విద్యారణ్యస్వామిని కూడా సంప్రదించాడు. చివరికి తాను స్వయంగా ఎలాగైనా ఆరు మాసాలలోగా ప్రతాపరుద్రుని

తీసుకువస్తానని ప్రతిన చేశాడు యగంధ నారాయణుడు. ఈలోగా ప్రతాపరుద్రుని పోలికలు ఉన్న వ్యక్తిని తీసుకువచ్చి రాజు వేషం వేయించి, అతనిని సింహాసనం మీద కూర్చుండబెట్టి ఈ రహస్యం ఎవరికీ తెలియకుండా చాకచక్యంగా పరిపాలన నడపడం ఎంతైనా అవసరమన్న నిర్ణయానికి వచ్చారు వారిద్దరూ.

అలాంటి వ్యక్తి కోసం వళ్ళంతా కళ్లతో వెతుకుతుండగా వారికి గోదావరీ తీరాన బట్టలు ఉతుకుతున్న పేరిగాడు కనిపించాడు.

ముమ్మూర్తులా అతనిలో ప్రతాపరుద్రుని పోలికలు ఉండడంతో తమ అన్వేషణ ఫలించిందన్న సంతోషంలో అతన్ని బుజ్జగించి, లాలించి చివరికి బెదిరించి నగరానికి తీసుకువచ్చి రాజువేషం వేసి, సింహాసనం మీద కూర్చోబెట్టారు.

ప్రతాపరుద్రుని తీసుకురావడానికి యుగంధ నారాయణుడు ఢిల్లీకి బయల్దేరాడు. ఈయన్నే యుగంధరుడు అనికూడా అంటారు.

పేరిగాడిని అడ్డు పెట్టుకుని, మేధకునిగా ఉన్నప్పుడు కాళిదాసు కూసిన కారు కూతలు, వేసిన వెర్రివేషాలను గురువుగారు సమర్ధించినట్లు- పేరిగాడి పిచ్చిచేష్టలను కూడా అద్భుతంగా సమర్ధిస్తూ ఎవరికీ అనుమానం రాకుండా రాజ్యపాలన చేయసాగాడు విద్యారణ్యస్వామి.

అన్న ప్రకారం ఆరు నెలల లోపలే ప్రతాపరుద్రుని బంధవిముక్తుని కావించి ఏకశిలా నగరానికి తీసుకువచ్చాడు యుగంధరుడు.

పేరిగాని ప్రతాపరుద్రావతారం సమాప్తం అయింది.

అతని సేవకు సంతోషించి ఘనంగా సత్కరించి, ఏదైనా వరం కోరుకోమని అడిగాడు విద్యారణ్యస్వామి.

"స్వామీ... తమ అనుగ్రహంతో ఆరు నెలలు అధికారం చలాయించాను. కానీ తృప్తి తీరలేదు. ఈ ఆంధ్రదేశాన్ని కనీసం ఐదేళ్ళపాటైనా పాలించే అవకాశం ఇయ్యండి" అని ప్రార్థించాడు పేరిగాడు.

"ఒరి... ఆర్నెల్లు కూడా పూర్తిగా సింహాసనం మీద కూర్చున్నావో లేదో కాని, నీ వాలకమే కాదు- తీరు, ఆలోచనలు కూడా మారిపోయాయి. అధికారంలోని ఆకర్షణ అటువంటిది మరి! అందుకే ఒకసారి కుర్చీ ఎక్కిన వాడు చచ్చేదాకా దాన్ని వదలనంటాడు. అటువంటప్పుడు నీకు కూడా ఇలాంటి కోరిక కలగడంలో ఆశ్చర్యం లేదు. నీ పూర్వ పుణ్యవశాన ఆర్నెల్లు రాచరికం వెలగబెడుతూ రాజభోగాలు అనుభవించే యోగం కలిగింది. ఆ పుణ్యం పూర్తయిపోయింది. మళ్లీ నువ్వు పేరిగాడిగా మారిపోక తప్పదు. అయితే... ఈ

ఆర్నెల్లు నువ్వు కాకతీయ సామ్రాజ్యం అల్లకల్లోలం కాకుండా మహోపకారం చేశావు. ఈ పుణ్యకార్యానికిగాను నీకు మళ్లీ మరుజన్మలో రాజయోగం పడ్తుంది. ఐదు వందల సంవత్సరాల తరువాత భాగ్యనగర సింహాసనం అధిరోహిస్తావు. నీ పరిపాలన గొప్పగా లేకపోయినా నీ రూపంతో, మాటలతో, నీ చేతలతో- అపర హాస్య బ్రహ్మవై ప్రజలు నిత్యమూ హాయిగా నవ్వుకునేట్టు చేస్తూ వారి మనసులలో శాశ్వత స్థానం సంపాదించుకుంటావు" అని వరమిచ్చాడు విద్యారణ్యస్వామి.

"మహాప్రసాదం స్వామీ!" అంటూ పూర్వాశ్రమానికి వెళ్లిపోయాడు పేరిగాడు.

* * *

ఐదు వందల సంవత్సరాలు అయిపోయాయి.

భాగ్యనగర సమీపంలో ఒక కుగ్రామంలో పేద ఇంట పుట్టాడు పేరిగాడు.

అయితే... పూర్వజన్మ పుణ్యబలం ఎక్కువగా ఉండడంతో పేరులో కూడా ప్రమోషన్ వచ్చింది. పేరిగాడు కాస్తా 'పేరయ్య' అయ్యాడు. మూసీ నదిలో సర్కారువారి ధోబీఖానాలలో బట్టలు ఉతకసాగాడు. పాత జన్మలో చేనేత బట్టలు ఉతుకుతూ ఉంటే, ఈ జన్మలో ప్రమోషన్ మూలంగా మిల్లు బట్టలు, టెర్లిన్, పాలిస్టర్ బట్టలు కూడా ఉతకడం మొదలుపెట్టాడు.

అయితే... రానురాను 'వాష్ అండ్ వేర్' రకం బట్టలు ఎక్కువ కావడంతో ఎవరి బట్టలు వారు ఇళ్లల్లో ఉతుక్కోవడం ఎక్కువైపోయాయి. బట్టలు ఉతికేవారికి గిరాకీ బాగా తగ్గిపోయింది.

ఫలితంగా పేరయ్య బట్టలు ఉతకడం మానేసి, వాళ్ళ బంధువు ఒకాయన ఫ్యాక్టరీలో పనిచేస్తూంటే, ఆయన రికమెండేషన్‌తో అందులో మజ్దూర్‌గా చేరాడు. ఆరోజుల్లో ఆ కూలిపని చేసినందుకు రోజుకు ఆరణాలు ఇచ్చేవారు. అయితేనేం... ఆరణాలకు ఎంతో విలువుండేది. దాంతో హాయిగా కాలం గడపసాగాడు పేరయ్య.

పేరయ్య నేర్చింది 'ఆ ఆ'లే అయినా, తెలివితేటలు ఉన్నవాడు కావడంతో- త్వరలోనే సాటి కూలీలలో మంచిపేరు సంపాదించగలిగాడు.

నెమ్మదిగా సాటి కూలీలను సంఘటితపరిచి వారికి నాయకుడు కాగలిగాడు.

నాయకులను గుప్పిట్లో పెట్టుకోవడం అవసరమని భావించే ఫ్యాక్టరీ యాజమాన్యం పేరయ్యకి త్వరలోనే 'రెగ్యులర్ ప్యూన్'గా ప్రమోషన్ ఇచ్చి ఉద్యోగం ఖాయం చేసింది.

ఆ ఫ్యాక్టరీకి దేశంలోని బడా బడా షేర్‌లు వాటాదార్లుగా ఉండడంతో తరచూ ఎంతోమంది పెద్దవారు, మందిబలం ఉన్నవారూ, రాజకీయ నాయకులూ వస్తుండేవారు.

ఎదుటివారి ముఖాలు చూసి వారి అవసరాలను అర్థంచేసుకుని, క్షణాలలో వాటిని సమకూరుస్తుండేవాడు పేరయ్య. దానితో పై అధికారులకు, పెద్దలకీ తలలో నాలుక అయిపోయాడు.

పేరయ్యకి ఉన్న పలుకుబడిని చూసి, అతని శక్తిసామర్థ్యాలను గుర్తించి, అతనిని తమ నాయకుడుగా ఎన్నుకున్నారు సాటి కార్మికులు. చూస్తుండగానే ఆ పెద్ద ఫ్యాక్టరీలోని వేలాదిమందికి ప్రియతమ నాయకుడైపోయాడు పేరయ్య. వటుడిలాగా వుండిన పేరిగాడు అచిరకాలంలోనే పేరయ్యగా వామనరూపం పొందాడు.

అవి ఢిల్లీ సింహాసనాన్ని బంగారుబాబు జనరంజకంగా పాలిస్తున్న రోజులు.

ఆయన ఎక్కడికి పోయినా వెంట తన కూతురు మాయాదేవిని తీసుకువెళ్తుండేవాడు. చిన్నతనంలోనే ఆమె తల్లి గతించడంతో, ఆమెను అల్లారుముద్దుగా పెంచుకుంటూ, సొంత సెక్రటరీగా పనిచేయించుకుంటుండేవాడు. తన తర్వాత ఆమె ఢిల్లీ సింహాసనాన్ని అధిరోహించాలని అంతరంగంలో కలలు కంటుండేవాడు.

ఒకసారి ఆ ఫ్యాక్టరీలో విభాగం ఒకదాన్ని ప్రారంభించడానికి ఢిల్లీ నుంచి బంగారుబాబు వచ్చాడు. వెంట మాయదేవి ఉందనే విషయం ప్రత్యేకించి చెప్పవలసిన అవసరం లేదు. ఆ సంధర్భంలో వారిద్దరూ ఆ ఫ్యాక్టరీ గెస్టుహౌజ్‌లో కొంచెంసేపు గడిపారు. ఆ సమయంలో ప్రత్యేక సిబ్బందితోపాటు, అక్కడ పేరయ్యను కూడా కాపలా ఉంచారు.

ప్రారంభోత్సవం అయిపోయిన తర్వాత బంగారుబాబు, కుమార్తె గెస్టుహౌస్‌కు తిరిగివచ్చారు. ఈయన గుమ్మంలో అడుగుపెడుతుండగానే టిప్‌టాప్‌గా ఉన్న పేరయ్య అమాంతం ఆయన కాళ్లమీద పడ్డాడు.

అటువంటివి బంగారుబాబుకు అలవాటే కనుక ఆయన ఏమీ కంగారుపడలేదు. నలుగురి వంకా చిరునవ్వు దృక్కులు సారించి ఆప్యాయంగా పేరయ్యను పైకి లేవనెత్తాడు.

"ఏంకావాలి? ఎవరు నువ్వు?" అని అడిగాడు.

"స్వామీ... నేను మీ భక్తుణ్ణి! నిత్యమూ మీ ఫోటోను ఇంట్లో పూజిస్తూ ఉంటాను. అంతేకాదు.., నా హృదయం మీదే దాచుకున్నాను కూడా!" అంటూ లోపలిజేబులో మంచి బంగారుబాబు ఫోటో ఒకటి తీసి చూపించాడు.

"సరే... ఏమి కావాలి?" అన్నాడు ఆయన.

"ఏమీ వద్దు స్వామీ? తమ దర్శనం అయింది... అదే పదివేలు!" అంటూ రెండు చేతులూ జోడించాడు పేరయ్య.

చిరునవ్వుతో ముందుకుసాగాడు బంగారుబాబు.

మాయాదేవి అటువంటి దృశ్యాలను ఎన్నింటినో చూసింది. కాని, పేరయ్య ముఖంలో కృత్రిమత్వం కనిపించలేదు. అతని ముఖంలో సాక్షాత్తూ రామునికి నమ్మినబంటు అయిన ఆంజనేయుని కళ గోచరించింది.

చిరునవ్వుతో అతనివంక ఆదరంగా చూసింది.

* * *

ఒక దశాబ్దం గడిచింది.

దేశంలో ఎన్నెన్నో మార్పులు వచ్చాయి.

ఒకరోజు అకస్మాత్తుగా బంగారుబాబు గుండెపోటుతో కన్నుమూశాడు. దేశం దుఃఖసాగరంలో మునిగిపోయింది. పేరయ్య హూటాహుటిన రెక్కలు కట్టుకుని ఢిల్లీలో వాలాడు.

బంగారుబాబు శవాన్ని ప్రజలకు ధర్మదర్శనం కోసం ఉంచారు. శవం ప్రక్కనే మాయాదేవి మౌనంగా విచారంగా కూర్చుని వుంది. పేరయ్య జనంతోపాటు శవ దర్శనానికి వెళ్లాడు. ఆ మృతదేహం పాదాలు పట్టుకుని గుండెలు అవిసేటట్లు రోదించడం మొదలుపెట్టాడు. ఆ హోరుకి, ఆ జోరుకి తలయెత్తి అటు చూసింది మాయాదేవి.

ఈ విగ్రహాన్ని ఎక్కడో చూసినట్లు అనిపించింది. అంతలో... పదేళ్లక్రితం భాగ్యనగరంలో చూసిన విషయం జ్ఞాపకానికి వచ్చింది.

ఆ సంఘటన ఆమె కళ్లముందు మెదులుతుండగానే, 'శివ పాదాలు' వదలని మార్కండేయునిలాగా 'శవ పాదాలు' వదలకుండా రోదిస్తున్న పేరయ్యను బలవంతంగా బయటకి పంపించారు భద్రతా పోలీసులు.

బంగారుబాబు శవానికి సకల రాజలాంఛనాలతో ప్రపంచాధినేతల సమక్షంలో అంత్యక్రియలు జరిగాయి. మంత్రివర్గంలో సీనియర్‌ని శౌచ్యప్రధానిగా క్యాబినెట్ ఎన్నుకుంది. సంతాపదినాలు అయ్యాక కొత్త ప్రధాని ఎన్నిక జరుగుతుంది.

మూడు రోజులు గడిచాక- ఎలాగోలాగ మాయాదేవి దర్శనం చేసుకోగలిగాడు పేరయ్య.

ఆమె ఆ విశాలమైన హాలులో కూర్చుని పరామర్శించడానికి వచ్చిన వారితో మాట్లాడుతోంది. ఆమె వద్దకి వెళ్లి అమాంతం పాదాల మీద పడి రోదిస్తూ-

"అమ్మా... తమ సెలవు తీసుకుపోడానికి వచ్చాను" అంటూ పాదాభిషేకం చేయసాగాడు.

ఆమె అభిమాన పూర్వకంగా అతని తల తట్టింది.

"తల్లీ... నాదొక చిన్న కోరిక!" అని విన్నవించుకున్నాడు పేరయ్య.

ప్రశ్నార్థకంగా అతని తల తట్టింది.

"నా ప్రభువు బంగారుబాబు పాదుకలు ఈ దీనుడికి అనుగ్రహించండి. వాటిని పూజామందిరంలో ఉంచి నిత్యమూ పూజించుకుంటాను. దేవరవారి పాదుకలు అనుగ్రహిస్తేనే కాని తమ పాదాలు వదలడీ దీనుడు!" అంటూ అమ్మగారి రెండు కాళ్లూ గట్టిగా పట్టుకున్నాడు పేరయ్య.

పేరయ్య మాటల్లో, ముఖంలో పదేళ్ల క్రితం కనిపించిన ఆ అమాయకత్వం, నిజాయితీ తిరిగి కనిపించాయి మాయాదేవికి.

వెంటనే బంగారుబాబుగారి బాత్‌రూం చెప్పులు తెప్పించి పేరయ్యకు బహూకరించింది అమ్మగారు.

వాటిని కళ్లకు అద్దుకుని భరతుడు రామపాదుకలు నెత్తిన పెట్టుకొని వెళ్లినట్లు నెత్తిన పెట్టుకొని అమ్మగారి దగ్గర సెలవు తీసుకున్నాడు పేరయ్య.

'ఈ అపర భరతుడు, ఈ అపర హనుమంతుడు ఎవరా?'... అని ఆశ్చర్యంతో నోళ్ళు వెళ్లబెట్టి చూడసాగారు అక్కడివారు.

బంగారుబాబు మరణంతో దేశం అల్లకల్లోలం అవుతుందనీ, కుక్కలు చింపిన విస్తరి అవుతుందనీ ఎందరో భయపడ్డారు. కాని, అటువంటిదేమీ జరుగలేదు. ప్రజల అభిమానం చూరగొన్న రత్నాకర పండిట్ కొత్త ప్రధాని అయ్యారు. బంగారుబాబు పార్టీకి మాయాదేవి అధ్యక్షురాలు అయింది.

త్వరలోనే అనేక రాష్ట్రాలతోపాటు ఆంధ్రప్రదేశ్‌లో కూడా అసెంబ్లీ ఎన్నికలకు ప్రకటన వెలువడింది. తాను ప్రముఖ కార్మిక నాయకుడననీ, అనేక ప్రజాహిత సంస్థలతో తనకు సన్నిహిత సంబంధం వుందనీ.., అందువలన తమ పార్టీ టికెట్ ఇప్పించవలసిందిగా కోరుతూ- బంగారుబాబు పార్టీ రాష్ట్ర కమిటీకి అభ్యర్ధన పత్రం సమర్పించాడు పేరయ్య. అంతేకాదు.., హుటాహుటిన హస్తినాపురానికి వెళ్లి మళ్లీ అమ్మగారి పాదాల మీద పడ్డాడు. తాను యం.యల్. ఏ. అయితే తన నియోజకవర్గంలో ప్రతీ ఇంటా బంగారుబాబు, మాయాదేవిగార్ల ఫోటోలు ప్రతిష్టింపచేస్తాననీ, వారి సూత్రాలు ప్రచారం చేయించి పార్టీని బలిష్టం చేస్తాననీ విన్నవించుకున్నాడు.

ఆ సమయంలో కూడా పేరయ్య ముఖంలో ఎప్పటి నిజాయితీయే కనిపించింది మాయాదేవికి.

"సరే... చూస్తాను!" అని పేరయ్యను పంపించేసింది ఆమె.

బంగారుబాబు పార్టీశాఖ హస్తినాపురంలోని అధిష్టాన వర్గానికి అభ్యర్థుల జాబితా పంపించింది. కొమ్ములు తిరిగిన మొనగాళ్ళు, హేమాహేమీలు, కురువృద్ధులు, గురు వృద్ధులు, మందభాగ్యులు, అనుభవజ్ఞులు, విప్లవ వీరులు... ఇలా ఎందరెందరో ఉన్నారు ఆ లిష్టులో. ప్రతివారు కూడా కేంద్రంలో ఎవరో ఒక అగ్రవాదులని ఆశ్రయించి, ఆశీస్సులు పొంది అందను మెండుగా ఆశించినవారే!

అయితే... పేరయ్య మాత్రం ఎవరి ప్రాపునూ కోరలేదు. 'కొట్టే గోల్కొండనే కొట్టాలి...' అన్నట్లు, ఏకంగా అమ్మగారి కాళ్లనే పట్టేశాడు.

మాయాదేవి ఈసారి తగు సంఖ్యలో కొత్తవారికి యువకులకి స్థానం కల్పించాలని అనుకుంది. జాబితా ముందువేసుకుని, సహాయకుల సహాయంతో ప్రతివారి జాతకాలు చూస్తూ శల్య పరీక్ష చేయసాగింది. ఎవరి ప్రాపకం కోరని అపర హనుమంతుడు పేరయ్యకి అవకాశం కల్పించాలని ఆమె మనసుకి అనిపించింది. అంతే... అతని అభ్యర్థిత్వమే ఖాయమైంది.

మాయాదేవి రాజకీయ మంత్రాంగం నడపడంలో మహా ఘటికురాలు. అంతకుముందే దేశంలో బంగారుబాబు పార్టీకి ప్రజల్లో పలుకుబడి వుంది. ఆ పలుకుబడి, ఆమె చాణక్యం రెండూ కలిసి ఆసారి ఎన్నికలలో బంగారుబాబు పార్టీకి బ్రహ్మాండమైన విజయాన్ని సంపాదించిపెట్టాయి.

పేరయ్య కూడా మంచి మెజారిటీతో గెలిచాడు. ఆ దెబ్బతో అమాంతం యమ్మెల్యే అయికూర్చున్నాడు పేరయ్య. తనకి అంతటి ఉన్నతిని కల్పించిన మాయాదేవికి పరమభక్తుడయిపోయాడు. ఇంట్లో బంగారుబాబు ఫోటో పక్కనే ఆమె ఫోటో కూడా పెట్టి పూజించినప్పుడల్లా, అమ్మగారి దర్శనాల సంఖ్య పెరుగుతున్నకొద్దీ మాయాదేవికి అతని పట్ల వాత్సల్యమూ పెరగసాగింది.

రత్నాకర్ పండిట్ ఏడాది తిరక్కుండానే ఆకస్మికంగా గుండెపోటుతో మరణించాడు. దాంతో ప్రధాని పదవికి వయోవృద్ధులు, అనుభవ వృద్ధులూ పోటాపోటీలు పడసాగారు.

చివరికి వారిలో వారు తేల్చుకోలేక, రాజీ అభ్యర్థిగా... బంగారుబాబు కుమార్తె కావడం ప్రధాన అర్హతగల మాయాదేవిని ఖాయం చేశారు.

తనకి ఆ పదవి రాకపోయినా నా వాడికి రాకూడదనే భావం ప్రబలంగా ప్రతి అభ్యర్థిలోనూ ఉండడంతో, మాయాదేవికి ఈ పదవి సులువుగా దక్కింది. పైగా... అనుభవ వృద్ధులు- అనుభవంలేని ఆ అబలను అడ్డుపెట్టుకొని అసలు పెత్తనం అంతా తామే చలాయించవచ్చునని అంతరంగంలో ఆశించారు.

అయితే... అచిరకాలంలోనే మాయాదేవి తాను 'అబల' కాదనీ, మగవారిని ముక్కు పట్టుకుని ఆడించగల 'మేటి' అని నిరూపించుకుంది. తనకి ప్రమాదం తెచ్చిపెట్టగలరని అనిపించిన వారందర్నీ కొట్టకుండా, తిట్టకుండా- కీళ్లు విరిచి మూల కూర్చొబెట్టింది. ఆ విధంగా కేంద్రంలో తన పదవిని పదిలం చేసుకున్నాక దృష్టిని రాష్ట్రాలవైపు మళ్లించింది.

అప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో సంతోషస్వామి ముఖ్యమంత్రిగా ఉన్నాడు. ఆయన కొంచెం గట్టి వాడు. ఆయన వల్ల ఎప్పటికైనా తనకి ప్రమాదం ఉండగలదని భావించింది మాయాదేవి. ఏదో ఒక కారణం చేత విద్యార్థులు రాష్ట్రంలో అలజడి చేస్తుంటే, ఆ అవకాశం తీసుకుని సంతోషస్వామి చేత రాజీనామా ఇప్పించి, ఆయనకు తన కేంద్ర మంత్రివర్గంలో స్థానం కల్పించింది. తనకి విధేయుడుగా వుంటూ, తన చెప్పుచేతలలో ఉండే అర్ధనారీశ్వరరావుని ముఖ్యమంత్రిని చేసింది.

వెంటనే ఆఘమేఘాల మీద పేరయ్యా హస్తినకు పరుగెత్తాడు. ఆమె పాదాల మీద పడి "తల్లీ... జగన్మాతా! నాకు మంత్రి పదవి కటాక్షించి, మరింతగా ప్రజాసేవ చేయడానికి వీలు కల్పించు" అని ప్రార్థించాడు.

అమ్మగారు చిరునవ్వు నవ్వి, "నీ విషయం పరిశీలిస్తాను" అని హామీ ఇచ్చింది.

అమ్మగారు నవ్విందంటే అర్థం- కార్యం అయ్యిందనే! అర్ధనారీశ్వరరావు మంత్రివర్గంలో పేరయ్యకు స్థానం లభించింది. ఆ దెబ్బతో ఆరణాల కూలీ పేరయ్య ఆంధ్రప్రదేశ్ మంత్రి అయిపోయాడు.

'విద్య యొసగును వినయంబు' అన్నారు పెద్దలు. పేరయ్యకి రాజకీయ విద్య మరింత వినయాన్ని నేర్పింది. మంత్రి కాగానే తొలుదొల్త ఢిల్లీకి ఎగిరి అమ్మగారి ముందు వాలి తన కృతజ్ఞతలు తెలుపుకున్నాడు పేరయ్య.

ఎప్పుడూ చిరునవ్వుతో సాగనంపే మాయాదేవి- ఈసారి పేరయ్యతో కొంచెంసేపు ఆంతరంగికంగా మాట్లాడింది.

"చూడు పేరయ్యా... ఈ దేశంలో అల్లకల్లోలం సృష్టించడానికి అంతః శత్రువులు ఎందరో ఉన్నారు. ఎన్నో విదేశీ హస్తాలు కనిపించకుండా పనిచేస్తున్నాయి. ఇటువంటి సమయంలోనే నీలాంటి నమ్మకస్తుల సేవలు ఎంతైనా అవసరం. మీ ముఖ్యమంత్రిగారు ఏమి చేస్తున్నదీ ఓకంట కనిపెట్టి, రెండో కంటికి తెలియకుండా ఆ సమాచారాన్ని నాకు అందిస్తూ ఉండు. నువ్వు చాలా పైకి వస్తావు" అని చెప్పింది.

"మహాప్రసాదం జగన్మాతా! అంతకంటేనా..!?" అంటూ తిరిగి భాగ్యనగరానికి లంఘించాడు పేరయ్య.

పునాది గట్టిగా కట్టిన తర్వాత ఇల్లు త్వరత్వరగా పూర్తి అయినట్లు కేంద్రంలో తన వర్గాన్ని ఏర్పాటు చేయసాగింది మాయాదేవి. ఏ ముఖ్యమంత్రీ బలపడి సొంత వ్యక్తిత్వం చూపించకుండా ఉండేందుకు ప్రతి రాష్ట్రంలోనూ అసమ్మతి వర్గాన్ని సృష్టించి పెంచి పోషించసాగింది. ఆంధ్రరాష్ట్రంలో ఇంకొకందుకు అల్లకల్లోలం ఏర్పడితే ఆ అవకాశం తీసుకుని, ఆ ఊపులో అర్ధనారీశ్వరస్వామి కొట్టుకుపోయేట్టు చేసింది.

తర్వాత సజల నయనారావుని- సమర్థుడన్న భావంతో కుర్చీలో కూర్చోబెట్టింది. ఆయన నిజంగా సమర్థుడే కాని సిద్ధాంతాలంటూ వ్రేలాడుతూ... అమ్మగారికి అనుకున్న విధంగా విధేయుడు కాలేకపోయాడు.

దాంతో- మరుసటి ఎన్నికలలో ఆయనకి పోటీగా మంత్రదండ మహారాజు మెజార్టీతో గెలిచి, సజల నయానారావు నామరూపాలు లేకుండా పోయాడు.

ముఖ్యమంత్రులు మారినా... పేరయ్య మంత్రిపదవికి మాత్రం ముప్పు రాలేదు. ఆయన అమ్మగారికి అంతకంతకీ మరింత సన్నిహితుడు కాసాగాడు.

'దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి' అన్న సామెతలో అచంచల విశ్వాసం ఉన్నవాడు మంత్రదండ మహారాజు. క్షణక్షణానికి మారే రాజకీయాల్లో తన పదవి ఎన్నాళ్లు ఉంటుందోనని, ఉన్ననాళ్లే ప్రతినిమిషాన్ని నగదుగా మార్చుకోడానికి ప్రయత్నాలు ప్రారంభించాడు. మంత్రదండాన్ని తిప్పుతూ ప్రతిపనికీ రేట్లు పెట్టాడు. రోజుకి లక్ష రూపాయలనైనా చూడందే ఆయనకి నిద్రపట్టేది కాదట!

ముఖ్యమంత్రులు ఎవరు వచ్చినా ఢిల్లీ సామ్రాజ్యానికి కప్పం కట్టడం తప్పనిసరి! ఢిల్లీకి చెల్లించవలసిన కప్పంలోకూడా మంత్రదండ మహారాజు కన్నాలు పెట్టున్నాడని మాయాదేవికి తెలిసింది. ఆ సమాచారం పేరయ్యవంటి విధేయుల మూలంగా అందిందేనని వేరే చెప్పనక్కరలేదు.

వెంటనే అసమ్మతి వర్గాలు విజృంభించాయి... మంత్రదండ మహారాజుని మార్చాలని!

కొత్త ముఖ్యమంత్రిని గురించి ఆలోచిస్తుండగా మాయాదేవి కళ్లముందు పేరయ్య విగ్రహం మెదిలింది.

'ఈ అమాయకుడు ఈ నిష్కపటి; ఈ నమ్మకస్తుడు ముఖ్యమంత్రి అయితే ఆంధ్రప్రదేశ్ వంటి అగ్రరాష్ట్రం గుప్పెట్లో ఉంటుంది. ఇక... సమర్థవంతమైన పరిపాలనా? అది ఎవరికి కావాలి? ఎటువంటి పరిపాలననైనా ఢిల్లీ నుంచి, భారతయుద్ధంలో శిఖండిని అడ్డు పెట్టుకున్నట్లు పేరయ్యను అడ్డుపెట్టుకుని నడపవచ్చు' అని అమ్మగారికి అనిపించింది.

వెంటనే ఆఘమేఘాల మీద హస్తినకి రావలసిందిగా కబురు వెళ్లింది పేరయ్యకు. ఇప్పటికీ తమ ఫొటోలతోపాటు బంగారుబాబు చెప్పుల్ని కూడా పేరయ్య తన పూజా మందిరంలో పెట్టి పూజిస్తాడన్న విషయం వేగుల ద్వారా గ్రహించింది.

పేరయ్య విమానాన్నే తన రెక్కలుగా చేసుకుని ఢిల్లీలో వాలాడు. "తల్లీ ఆజ్ఞ!" అంటూ అమ్మగారికి పాదాభివందనం చేశాడు.

"చూడు పేరయ్యా! నువ్వు నమ్మినబంటువన్న విషయం నాకు తెలుసు. నమ్మినవారిని కరుణించి యథోచితంగా సత్కరించడం మా వంశాచారం. నీ సేవలను మరింతగా ఉపయోగించుకోడానికి నీమీద అత్యంత గురుతరమైన బాధ్యతను పెడుతున్నాను. ఇకముందు నువ్వే ఆంధ్రప్రదేశ్‌కి ముఖ్యమంత్రివి. ఈ బరువును నీవు మోయగలవా?" అని అడిగింది మాయాదేవి.

"తల్లీ! రామబాణంకంటే రామనామం గొప్పదని ఆంజనేయస్వామి నిరూపించలేదా! ఆ స్వామి నాకు గురువు. నిత్యమూ నీ నామాన్ని స్మరించే నేను- నీ ఆశీస్సులతో ఎంతటి పనినైనా చేయగలను" అన్నాడు పేరయ్య.

అంతే... మంత్రదండ మహరాజు మంత్రదండం పనిచేయక ఆగిపోయింది. 'ఆయన ముఖ్యమంత్రి ఆయెనే...' అంటూ ఆనందమానందంగా పాటలు పాడారు. డప్పులు కొట్టారు, బొట్లు పెట్టారు, దండలతో ముంచెత్తారు, ఊరూరా- వాడవాడా ఊరేగించారు. సన్మానాలు చేశారు. ఇంద్రుడనీ- చంద్రుడనీ, కంతుడనీ- జయంతుడనీ పొగిడారు. 'ఆరణాల కూలీనుంచి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వరకూ..!' అంటూ పుస్తకాలు రాశారు.

ఈ ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయిపోయి బెలూన్‌లాగా ఉబ్బిపోయాడు పేరయ్య. పేరయ్య చదువుకోలేదు కాని- తెలివితేటలు ఉన్నవాడు, కార్యసాధకుడు. తన కొత్త పదవిలో ఇబ్బందిలేకుండా ఉండడంకోసం నమ్మకస్తులైన కొందరు సలహాదారులను ఏర్పాటు చేసుకున్నాడు. వాళ్ళు పేరయ్యకు ముందుగా తనభాషను మార్చుకోవలసిన అవసరం ఉందని చెప్పారు. ఉపన్యాసాల్లో సంస్కృత పదాలు ఎక్కువగా వాడితే వినడానికి బాగుండడమేగాక, ఆ వ్యక్తిపట్ల ప్రజల గౌరవం ఇనుమడిస్తుందని చెప్పారు. దాంతో పేరయ్య సంస్కృత పదాలు ఎక్కువ ఉండే తెలుగు పత్రికలు, పుస్తకాలు చదవసాగాడు.

పేరయ్య యమ్మెల్యేగా ఉండిన రోజుల్లోనూ, మంత్రిగా ఉండిన రోజుల్లోనూ అనేక సాంస్కృతిక సంఘాలతో సంబంధాలు పెట్టుకున్నాడు. ఆయన ఇప్పుడు ముఖ్యమంత్రి కావడంతో సాంస్కృతిక సంఘాలన్నీ కలిసి పేరయ్యకి ఘన సన్మానసభ ఏర్పాటు చేశాయి.

వేలాదిమంది హాజరైన ఆ సభలో పేరయ్యను పూలమాలలతో అలంకరించి 'అపరభోజుడనీ, అభినవ కృష్ణదేవరాయ'లనీ- ఇలా, ఇలా... అన్నివిధాలా పొగిడారు సమావేశకర్తలు.

"నేను కళావంతుడిని కాకపోయినా, నన్ను ఇంత ఘనంగా సన్మానించారంటే... ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాను" అంటూ ప్రారంభించాడు.

సభ చప్పట్లతో, నవ్వులతో దద్దరిల్లిపోయింది. అదంతా తనపట్ల అభిమానం అనుకున్న పేరయ్య-

"కళలకు మనదేశం పుట్టినిల్లు. మన ప్రజలు ఎంతో పేదరికంలో వున్నా కూడా ఇంతమంది కళావంతులు ఈ గడ్డమీద వున్నారంటే అది ఈ దేశపు గొప్పతనాన్ని చాటుతోంది" అంటూ ఉపన్యాసం కొనసాగించాడు.

సభలో మళ్లీ చప్పట్లు, ఈలలు కూడా తుపాను గాలిలా హోరు పలికాయి. అధ్యక్షులవారు నెమ్మదిగా పేరయ్య చెవి దగ్గర "కళావంతులు అనకండి, కళావంతులు అనకండి- కళాకారులు అనండి" అని చెప్పారు.

తన మాటలో ఏదో లోపం వుందని గ్రహించుకున్న పేరయ్య తన మాటని 'కళాప్రియులు'గా మార్చి ఉపన్యాసం పూర్తిచేశాడు.

సభ ముగిసింది.

కారులో తిరిగి వెళ్తుండగా సహాయకుడు చెప్పాడు- "కళావంతులు అంటే ఒకప్పుడు వేశ్యవృత్తి చేసి, ఆ వృత్తి మానేసి గౌరవంగా జీవిస్తున్న కులస్థులు" అని!

"అలాగా... కళను కలిగినవారు కళావంతులు అనుకున్నాను. ధనవంతులు, బలవంతులు లాగా..! ఈ సంస్కృతంతో మాచెడ్డ చిక్కొచ్చిందయ్యా!" అంటూ ఫెడీ ఫెడీ నవ్వాడు పేరయ్య.

ఉన్నట్లుండి ఒక్క కుదుపుతో కారు ఆగింది.

"ఏమైంది డ్రైవరూ?" అని అడిగాడు పేరయ్య.

"స్పీడ్ బ్రేకరుంటే అడ్డు వచ్చింది సార్!" అన్నాడు డ్రైవర్.

"మరి... ట్రాఫిక్ పోలీసులు ఏం చేస్తున్నట్టు? పి.యే. నోట్ చేస్కో- కమిషనర్‌తో ఈ స్పీడ్‌బ్రేకర్లను అరెస్ట్‌చేయమని చెప్పు" అన్నాడు.

"స్పీడ్ బ్రేకర్ అంటే... రోడ్డు మీద వాహనాల వేగాన్ని తగ్గించేందుకు ఎత్తుగా వేసే దిమ్మ!" అని సహాయకుడు నెమ్మదిగా చెప్పాడు.

"అలాగా..!" అంటూ ఫెడీఫెడీ నవ్వాడు పేరయ్య.

దారిలో జనరల్ హాస్పిటల్ కనిపించింది. ఆకస్మికంగా దాన్ని తనిఖీ చేయాలని బుద్ధి పుట్టింది పేరయ్యకి.

వెంటనే కారుని హాస్పిటల్‌లోకి పోనిమ్మన్నాడు. ఒక మాములు వ్యక్తిలాగా ఆస్పత్రిలో తిరగసాగాడు. లోపల ఒకచోట 'లేబర్ రూం' అని వున్న బోర్డు కనిపించింది.

అది చూసి మాజీ కార్మిక నాయకుడు పేరయ్యకు చెప్పలేని సంతోషం వేసింది. "మన ఆస్పత్రులు చాలా అభివృద్ధి చెందాయయ్యా! ఫ్యాక్టరీలలోనే కాకుండా, ఆస్పత్రులలోకూడా లేబర్ కోసం సెపరేట్ గదులు పెట్టారు" అన్నాడు ప్రక్కవారితో.

"లేబర్ రూం అంటే... పురిటి గది!" అని నెమ్మదిగా చెప్పాడు సహాయకుడు.

"భలేగా ఉందే..." అంటూ మళ్లీ ఫెడీఫెడీ నవ్వసాగాడు పేరయ్య అమాయకంగా.

నవ్వు ఆగక ముఖం తిప్పుకున్నారు పక్కనున్న వాళ్ళు.

మర్నాడు... ఒక కుటుంబ సంక్షేమ కార్యక్రమానికి అధ్యక్షత వహించాడు పేరయ్య. ప్రారంభోపన్యాసంలో-

"మహాజనులారా! భారత కాలంలో కర్ణుడు గొప్ప గొప్ప దానాలు చేసి దానకర్ణుడు అన్న బిరుదు పొందాడు. అచ్చు ఎరుగని రోజుల్లో విద్యాదానం అన్నిటిలోకి గొప్పదానం. ఈ కలికాలంలో గర్భాదానం బహుళ ప్రచారం పొందింది. కాని, ఈ ఆకలి కాలానికి ఇది తగదు" అంటూ ఛలోక్తులతో ఉపన్యాసం మొదలుపెట్టాడు.

హాలు చప్పట్లు, ఈలలతో దద్దరిల్లిపోయింది.

"అమాయకుడిగా కనిపించే పేరయ్య ఎంత అర్థవంతంగా మాట్లాడే స్థాయికి ఎదిగి పోయాడు!?" అని ఆశ్చర్యపోయారు అందరూ.

ఉపన్యాసం అయిన తర్వాత ఒక కొత్త హాలుకి ప్రారంభోత్సవం చేయవలసి వుంది.

"గది ద్వారానికి అడ్డంగా ఉన్న రిబ్బన్‌ను కత్తిరించండి" అన్నాడు పీ. యే.

అయితే... బానపొట్ట అడ్డు రావడంతో ఆ రిబ్బన్ పేరయ్యకి కనిపించలేదు. అటూ ఇటూ చూశాడు. ప్రక్కనే ఒక చిన్నపిల్ల జడనుంచి రిబ్బన్ వేలాడుతుంటే కసుక్కున దానిని కత్తిరించేశాడు. చప్పట్లతో హాలు దద్దరిల్లిపోయింది.

ఆ సమయంలో ద్వారానికి వున్న రిబ్బన్ కనిపించింది పేరయ్యకి. దాన్నికూడా కత్తిరించి "ఈ పాప రిబ్బన్ కత్తిరించడంలో నా ఉద్దేశం మీకు అర్థమయ్యే ఉంటుంది. ఈ పాప కొన్నేళ్ళలో జీవితంలో అడుగుపెట్టుంది. తన రిబ్బన్ కత్తిరింపు- కుటుంబాన్ని అదుపు చేసుకునే అవకాశాన్ని ఆమెకు జ్ఞాపకం చేస్తుంది. అలాగే అందరు స్త్రీలకూను!" అంటూ సర్దుకున్నాడు.

"అబ్బో... పేరయ్య పొట్ట- ఉపాయాల పుట్ట!" అనుకున్నారు అందరూ.

సభ జయప్రదంగా ముగిసింది.

సభకు హాజరైన పౌరులు పేరయ్య ప్రసంగంలోని వ్యంగ్యాన్ని చర్చించుకొంటూ వెళ్లిపోయారు.

ముఖ్యమంత్రిగారు పరివారంతో సహా ముఖ్య అధికార్ల నుండి, ప్రముఖుల నుండి సెలవు తీసుకొని నిష్క్రమించారు.

పేరయ్య తన మాటలతో, చేతలతో దేశ ప్రజలను నిత్యం నవ్వించసాగాడు. పత్రికలవారికీ, కార్టూనిస్టులకీ కావలసినంత ముడిసరుకును అందజేయసాగాడు. అనుభవంతో పాటు తన పదవిని పదిలం చేసుకోడానికి సొంత వర్గాన్ని ఏర్పరుచుకోసాగాడు. చాటున నవ్వుకున్నా ఎదుట మాత్రం 'పేరయ్యకి జై!' అనేవారి సంఖ్య ఎక్కువ కాసాగింది.

పేరయ్యతోపాటు మాయాదేవి చిత్రాలు కూడా కార్టూన్లలో రాసాగాయి. ఇవన్నీ చూసి మాయాదేవికి ఒళ్ళు మండిపోయింది. ఏకులాంటి పేరయ్య మేకులా అవుతాడని ఆమె అనుకోలేదు. గొడ్డలిదాకా రాకుండా గోటితోనే తుంచివేయాలని అనుకుంది.

'పేరయ్య అసమర్థుడు' అన్న ప్రచారం ముమ్మరం అయింది. పార్టీ సభ్యుల అభీష్టం మేరకు అంటూ ఏడాది అయిందో, లేదో... పేరయ్యని ముఖ్యమంత్రి పదవినుంచి దింపేసింది.

'ముఖ్యమంత్రి పేరయ్య' మామూలు యమ్మెల్యే అయిపోయాడు.

ఆరాత్రి పేరయ్యకి ఒక కల వచ్చింది-

తాను గోదావరి ఒడ్డున బట్టలు ఉతుకున్నాడట. అందరు తనని "పేరిగా..!" అంటున్నారట.

"నన్ను పేరిగా అంటారేమిటి? నా పేరు పేరయ్య. నేను ఈ దేశానికి రాజుని!" అంటూ గట్టిగా అరుస్తూ నిద్రలేచాడు.

"అయ్యో... ఇదంతా కలేనా?" అనుకున్నాడు. మళ్లీ పడుకున్నాడు కాని, నిద్రపట్టలేదు. గుండెల్లో ఎవరో "పేరయ్య రాజంట! పేరయ్య రాజంట!!" అని పదేపదే అవే మాటలు అంటున్నట్లు అనిపించసాగింది.

- విజయ మాస పత్రిక... మార్చి '86